కామెడీ కథ

# ఉంటమ్మా చీర పెట్టా

**"అమ్మోయ్! అత్తయ్యొచ్చేసింది. ఏం అత్తయ్యా, బావున్నావా? అమెరికా వెళ్ళి బలే తెల్లబడ్డావ్. ఆర్నెల్లకే ఇంత తెలుపయితే ఇంకో ఆర్నెల్లుండుంటే హమ్మో! ఇంకెంత తెల్లగా అయిపోయుండేదానివో!"**

''అందుకేగా తల్లీ మళ్ళీ ఈ దేశానికొచ్చానూ. మరీ దిష్టి తగిలిపోకుండా కాస్త నలుపంటించుకుందామనీ.''

''అంటే, ఇక్కడెవరూ తెల్లవాళ్ళు లేరనా నీ ఉద్దేశం?''

''అబ్బ! ఉండవే లంఖిణీ! అత్తయ్యని లోపలికి రానీ. గుమ్మం దగ్గరే పిడివాదమూ నువ్వూను. రా వదినా! చూసావుగా రోజురోజుకీ ఇదెలా తయారవుతోందో? ఎడ్డెమంటే తెడ్డెం అనకుండా ఊరుకోదు. వితండం! అంతా వాళ్ళ నాన్న పోలిక. మనింట్లో ఇలాంటి అలవాట్లెక్కడున్నాయీ?''

''ఘోరం! అమ్మా, నీ అన్న పెళ్ళాం వొచ్చిందని సంతోషిస్తే సంతోషించుగానీ 'మనిల్లు' అని కలిపేసుకోకు. ఇదే నీ ఇల్లు. నువ్వన్న 'మనిల్లు' మీ వొదినిల్లు పెర్మనెంటుగా. మెట్టినింటిని నీ ఇల్లుగా భావించడం అరవై యేళ్ళు కాపురం చేసినా అలవాటు చేసుకోవు కదా?''

''నువ్వు నోరు మూసుకు దయచెయ్యిక్కడ్నించి. వెళ్ళు. అత్తయ్యిప్పుడే రైలు దిగింది కదా..''

''రైలు కాదు ప్లైటు''

''సరే. ప్లైటే దిగొచ్చింది కదా! ముందు ఇన్ని కాఫీ నీళ్ళకి ఏర్పాటు చెయ్యి నాకూ్కడా. తరువాత ఆవిడ స్నానానికి గీజరు స్విచ్చెయ్యి. వంటావిడేం తగలెడుతోందో చూడు''

''ఓరి బాబోయ్! అన్ని పనులూ నేనే చేస్తే ఇంక మరి నువ్వేం చేస్తావమ్మా తెలీకడుగుతా. బాబోయ్! చూపుల్తో భస్మం చెయ్యకు. పోతున్నా.''

''చూసావా వొదినా? పిల్లకాదిది. పిశాచం. ఇలా నెట్టుకొస్తున్నాననుకో సంసారం.''

''అది అరవై యేళ్ళంటే గుర్తొచ్చింది. ఇవాళ మీ ఆయన షష్టిపూర్తి కదూ! ఏడీ కనపడడేం బర్త్‌డే బోయ్? ఇంట్లో హడావిడేం లేదేం? చాలా ఆర్భాటంగా చేసుకుంటారనుకున్నానే! ఫంక్షనంతా సాయంత్రమేనా ఏవిటి?''

''ఫంక్షనా బోషాణమా? ఏవీ లేదు. ప్రభుత్వం వారు చైనా పంపుతాం అన్నారు. ఈయనగారు ఎగురుకుంటూ వెళ్ళారు. నీతో ఫోన్లో మాటాడేనాటికి లేదీ వ్యవహారం''

''అదేవిటీ? రిటైరవలేదా?''

''గవర్నమెంటు ఎక్స్‌టెన్షనిచ్చిందత్తయ్యా మా నాన్నకి. మా నాన్న ఎంత గ్రేటో నీకేం తెలుసు? ఇందా కాఫీ..''

''అయ్యో! మిమ్మల్నిద్దర్నీ కూచోబెట్టి బట్టలు పెట్టి హడావిడీ హంగామా చేసేద్దామని ప్లానేసుకొచ్చానే!''

''మా అత్తయ్యా వాళ్ళొచ్చి హడావిడి చేసార్లే అత్తయ్యా''

''అదే వొదినా! మా ఆడపడుచూ వాళ్ళొచ్చార్లే. నువ్వు రావడానికి ఓ గంట ముందే మా ఆయన ప్లైటు. పొద్దున్నే ఆయనెళ్ళేలోపే వాళ్ళొచ్చారు హేపీ బర్త్‌డే అని దీర్ఘాలు తీసుకుంటూ.''

''ఏం కానుకలు తెచ్చిందేవిటి మీ ఆడపడుచు?''

''అమ్మకీ నాన్నకీ బట్టలు పెట్టారత్తయ్యోయ్ ఆ అత్తయ్యా వాళ్ళు''

''సరే. మా తమ్ముడుగారూళ్ళో లేరుకాబట్టి ఆయన షష్టిపూర్తి సందర్భంగా ఇద్దరికోసం తెచ్చినవీ నీ చేతికే ఇచ్చేస్తా. కుంకంభరిణ(త్రా)మ్మోయ్ లంఖిణీ! ఇదుగో మరదలా నీకు కంచిపట్టు చీరా ఆయనకి సూటింగూ.''

''ఎందుకొదినా ఇప్పుడివన్నీ. నువ్వొచ్చావు అభిమానంగా. అదే మాకు పదివేలు.''

''ఊరుకో. కాదనకు. ఏదో మా ముచ్చట.''

''అబ్బ! ఈ రొటీన్ డైలాగులు వినీ వినీ చెవులు చిల్లులు!''

''నువ్వు నోర్మూయ్''

''ఇదీ రొటీన్ డైలాగే. వెరైటీ కోసం నేనే డైలాగులు మారుస్తుంటా.''

''ఇంతకీ మీ ఆడపడుచేం బట్టలు పెట్టిందీ తన అన్నగారి షష్టిపూర్తి సందర్భంగా?''

''చచ్చాం. గోవిందా గోవింద!''

''ఏవిటే? పెద్దవాళ్ళం మేమూ మేమూ మాటాడుకుంటుంటే నీ నీలుగేవిటీ?. అవతలకి నడు ముందు''

''రొటీన్! రొటీన్! వెరైటీకోసం ఇవతలకి పరిగెడతా..''

''ఇదుగో వొదినా ఆవిడగారు తెచ్చిన బట్టలు. ఆయనకి సఫారీ సూటూ నాకు ఇదుగో రెండొందల్రూపాయల ఆప్కో చేనేత వస్త్రం.''

''అయ్యో. ఇదెక్కడ న్యాయం? ఇంత నాసిరకమా?''

''నువ్వే న్యాయం చెప్పొదినా. నేనూ నీకు ఆడపడుచునే కదా. ఏనాడైనా నీకిలాంటి చవకరకం బట్టలెట్టానా?''

''అయ్యో, నీ లెవెలే వేరు. అవునూ..ఈ చీరా..నీ పెద్దకూతురి పెళ్ళిలో మీ వియ్యాలారు నీ ఆడపడుచుకి పెట్టిన చీరలా ఉందే!''

''అవునొదినోయ్. అలాగే ఉంది. అసలా వియ్యాలారి పేరెత్తకు. నాకు ఒళ్ళు మండుతుంది. నేను వాళ్ళకని పట్టుచీరలు పెడితే నా మొహాన్నో సంతలో దొరికే సింతటిక్కు చీర కొట్టారు. ఈవిడ వాలకం చూసి ఈవిడకిలా ఈ చీరెట్టారు కాబోలు! ఈవిడేమో షష్టిపూర్తన్చెప్పి తిప్పి దీన్ని నా మొహాన కొట్టింది. ధైర్యం వుంటే వాళ్ళ మొహాన కొట్టాలిగానీ!''

''ఏదో వాళ్ళకి తోచింది వాళ్ళు పెట్టార్లేవే అమ్మా! ఇష్టమయితే కట్టుకో లేకపోతే దానం చేసెయ్. పాపం అత్తయ్యా వాళ్ళనేం తిట్టుకోకే.''

''చూసావా వొదినా? ఇదెంతసేపూ వాళ్ళ పక్షమే..''

''అది కాదే లంఖిణీ! మీ అమ్మ లెవెలేవిటీ ఆ చీరేవిటి? మరి వాళ్ళల్లాంటివి పెడితే పాపం ఆవిడ మనసు చివుక్కుమనదూ? నువ్వర్థం చేసుకుని మీ అమ్మకి సపోర్టివ్వాలిగానీ''

''ఏవిటి సపోర్టూ? వారం క్రితమే బజారెళ్ళి నాన్న అరవయ్యో పుట్టిన్రోజని చెప్పి అమ్మ ఆరు వేల రూపాయల పట్టుచీర కొనుక్కుంది. ఆవిడకి చీరలక్కొదవా? ఆ ఆరువేల చీర కట్టుకుని సంతోషించక వీళ్ళేదో పెట్టారని గొడవెందుకు?''

''నిన్ను నోర్మూసుకునవతలకి దయచెయ్యమన్నానా? పెద్దంతరం చిన్నంతరం లేకుండా తెయ్యిమని వాదించడానికొస్తావ్.''

''పోతున్నా తల్లీ. పోతున్నా''

''అంతా వాళ్ళ నాన్న గారం! గర్భశత్రువు పుట్టుకొచ్చింది. వొదినోయ్! నేనూరుకుంటానను కోకు. మా ఆడపడుచుని ఇంతకింతా దెబ్బతీస్తా. వచ్చేనెల్లో వాళ్ళు గృహప్రవేశం చేసుకుంటున్నారు. నాసిరకం నూలు వస్త్రాలకి ఆంధ్రదేశంలో కరువేం

రాలా.''

''అవునుమరి. ఊరుకోకూడదు. దెబ్బకి దెబ్బ తియ్యాల్సిందే.''

★ ★ ★

''ఒరేయ్ ముంగీ! వింటున్నావా అమ్మ, అత్తయ్యల కుట్రలు?''

''విని విని బుర్ర వాచిపోయింది. చిన్నక్కోయ్! నువ్వు కూడా ఆ కూటమిలో చేరిపోడానికి ఇంకెన్నాళ్ళో పట్టదులే. నాన్న నీకు సంబంధాలు చూస్తున్నాడు. పెళ్ళీ పేరంటాలూ చీరలు రవికెలూ పెట్టుకోడాలూ నీక్కూడా రొటీనయిపోయి నువ్వూ అమ్మా వాళ్ళలాగే చీరలు పెడుతూ పెట్టించుకుంటూ...కుట్రలూ కుతంత్రాలూ పన్నుతూ..''

''ఛీ ఛీ నెవర్. ఈ చీరల పోరాటాల్తప్పించుకోడానికి నేనో నిర్ణయానికొచ్చాను.''

''ఏంటీ? జన్మలో చీర కట్టనని శపథం చేసి చీర విడిచిన వీర వనితగా చరిత్రలో ప్రసిద్ధికెక్కాలనా?''



''షటప్. నాకు తమ్ముడివైపుట్టి ఇంత బెవార్సు ఐడియాలెలా వేస్తున్నావురా? అది కాదు. నా నిర్ణయం వేరు. నేనసలు పెళ్ళే చేసుకోను. పెళ్ళి చేసుకుంటే ఈ రొటీన్‌లో పడక తప్పదనిపిస్తోంది.''

''పెళ్ళి చేసుకోవూ? మరేం చేస్తావ్?''

''ప్రస్తుతం బ్యాంకు గుమాస్తా ఉద్యోగం సంపాదించాకదా ఇంక ఉద్యోగం మీదే కాన్‌సన్‌ట్రేట్ చేసి అంచెలంచెలుగా మేనేజర్ లెవెల్‌కెదుగుతా.''

''నువ్వెదుగుతుంటే నీ జీతం కూడా ఎదుగుతుంది. అప్పుడు నీకోసం కాకపోయినా నీ డబ్బు కోసం ఎవడో ఒకడు నిన్ను వల్లో వేసుకుని నీకు తాళి కట్టెయ్యడం ఖాయం''

''రేపే సన్యాసం పుచ్చేసుకుంటా.''

''అది మరీ డేంజరు. భక్తులు పాదపూజల్చేసి వస్త్రాలు సమర్పిస్తారు.''

''ఎవరెన్ని సమర్పించినా కాషాయ వస్త్రాలేగా''

''వాటిల్లో కూడా పట్టూ, పాలిస్టరూ, మిల్లు కాలునూ, చేనేత అని లెవెల్సుంటాయ్. ఫలానా భక్తమండలి వాళ్ళు పట్టు కాషాయాలు పెడితే మీరు నూలు పెట్టారేంట్రా అని నువ్వూ రొటీన్ పోట్లాటలు సాగిస్తావ్. సన్యాసివైనా, సన్యాసులేవన్నా తక్కువ తింటారా? కోట్లు హుండీలో వేయంగలరు. రాజ్యాలేలగలరు.''

''అంతేనంటావా? అయితే అమెరికా పోతా సుబ్బరంగా''

''హు..అజ్ఞానం!''

''ఏం?''

''నా ఫ్రెండు అర్భకుడు తెలుసుకదా? వాడి అన్న అమాయకుడు అమెరికాలోని ఆస్టిన్‌లో ఉంటాడు. వాడి వల్ల తెలుస్తున్నదేమిటంటే అమెరికాలోని భారతీయ వనితలు అక్కడకూడా ఇంటికొచ్చిన చుట్టపక్కాలాడాళ్ళకి చీరలు పెట్టే సాంప్రదాయం యధావిధిగా సాగిస్తున్నార్ట. కిందటి సంక్రాంతికి అమాయకుడి పెళ్ళాం గడుసుపిండం

**పోడూరి కృష్ణకుమారి**

ఏం చేసిందో తెలుసాక్కా? హ్యూస్టన్ నించి పండక్కొచ్చిన తన సొంత అక్కగారికి వంద డాలర్ల చీర పెట్టి బోస్టన్ నించొచ్చిన అమాయకుడి అక్కకేమో పది డాలర్ల చీరెట్టిందిట.''

''సాంప్రదాయం గొప్పగా నిలబెట్టిందే! అత్తింటి కుండ, పుట్టింటి కుండ తేడా చూపించాల్సిందే అమెరికాలో అయినా.''

''ఆ కుండ సాంప్రదాయం ఏంటోగానీ అక్కడ పెట్టిన చీరల ఫలితంగా ప్రస్తుతం స్వదేశంలోనూ విదేశంలోనూ కూడా గడుసుపిండం తరుపు వాళ్ళూ అమాయకుడి తరపు వాళ్ళూ కుండలు బద్దలుకొట్టేసుకుని సంబంధాలు తెంచేసుకున్నారు. ఆ తరపు కాకులు కూడా ఈ తరపు కాకుల్తో మ్యాచ్‌లు ఫిక్స్ చేస్కోట్లేదుట.''

''హోరి! ఈ చీరలెట్టుకోడాలు ఎలకలు కొరకా! సో. అమెరికా కూడా మనకి అవుటాఫ్ బౌండ్స్ అయిపోయిందన్నమాట. ఒరేయ్. నీకెలాగూ ఈ రెణ్ణెల్లూ సెలవలే. గోళ్ళూ వేళ్ళూ గిల్లుకుంటూ కుళ్ళిపోకుండా ఏం చేస్తావంటే ఆ కంప్యూటరు ముందలాగే కదలకుండా కూచుని బ్రౌజింగో గ్రేజింగో చేసి మన భారతీయులు అందునా తెలుగు వాళ్ళు ఇంకా కాలు మోపని దేశం ఏదయినా ఉందేమో కనిపెట్టు. ఈ సెలవలకి ఇదే నీకు ప్రాజెక్టు. నువ్వు కనిపెట్టిన మరుక్షణం నేనాదేశంలో పాదం మోపి సెటిలయిపోతా.''

''ఓకే. ఆ పని మీదే ఉంటా. నీతో పాటే నేనూ మోపుతా.''

★ ★ ★

''హమ్మయ్యా! వచ్చేసావా వదినా! మొన్న మా ఆడపడుచు గృహప్రవేశానికి వెళ్ళొచ్చినప్పట్నుంచీ నువ్వెప్పుడెప్పుడొస్తావా అని కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాననుకో.''

''ఈ నెల్రోజులూ మా అన్నయ్యింట్లో ఉన్నానన్నమాటేగానీ మరదలా! శరీరం అక్కడా మనసేమో ఇక్కడా. మా వదినా ఆవిడ చుట్టాలూ అంతా ఏబ్రాసి రకాలనుకో. ఏం చీరలో ఏమో. ఒక్కత్తీ నీ లెవెల్లో చీర కట్టే రకం లేదు. అదే అనేసా మా వదినతో. మా మరదలి లెవెలే వేరు అన్చెప్పి.''

★ ★ ★

''ఒరే ముంగీ! వింటున్నావా?''

''వింటున్నాన్లేవే''

''ఇప్పుడు అత్తయ్య ఇచ్చిన డైరెక్టు స్పీచ్‌లో ఇన్‌డైరెక్టు తాత్పర్యం గ్రహించావా?''

''తెలుసులేవే. అత్తయ్య ఈ నెలా మనింట్లో ఉండి మళ్ళీ అమెరికా వెళ్ళిపోతుంది కదా అప్పుడు అమ్మ ఆవిడకి హై లెవెల్ చీరే పెట్టాలని ఇన్‌డైరెక్ట్ వార్నింగ్. ఆ మాత్రం బుర్ర నాకూ ఉంది.''

''నా ట్రెయినింగు మూలాన కాదా నీ బుర్రలా పదునెక్కింది. ఇప్పుడు చూడూ వాళ్ళ మధ్యకెళ్ళి ఓ బాంబు పేలుస్తా''

★ ★ ★

''అత్తయ్యా! వచ్చేసావా? నువ్వు టైముకి ఉండకుండా మీ అన్నయ్యింటికెళ్ళిపోయావుగానీ మా అత్తయ్య గృహప్రవేశం బ్రహ్మాండంగా జరిగింది. మామిడికాయ పప్పూ దోసావకాయా అదుర్సే అదుర్స్''

''హు..ఈ లంఖిణి పిల్ల టేస్టుకి తగ్గట్టే మెక్కబెట్టిందిలే వొదినా వాళ్ళత్తయ్యా. అదో భోజనం!''

''అవునూ, మరదలా! ఇంతకీ ఆ రెండొందలు కూడా చెయ్యని వస్త్రం మీ ఆడపడుచుకి పెట్టావా?'' ''పెట్టకేం! చెప్పుచ్చుకొట్టినట్టు చీరెట్టొచ్చానొదినోయ్'' ''కానీ, నీ దెబ్బకి దెబ్బ స్కీముదెబ్బ కొట్టేసిందే అమ్మా''

''ఏవిట్రా పేలాపన?''

''ఔనే. అత్తయ్య ఎస్టిమేషను తలకిందులైగెస్టులు ఎక్కువమందొచ్చారుగా. అత్తయ్య ఆడపడుచు కొడుకు సోంబేరి లేదూ వాడి పెళ్ళాం సోగత్తెకి పెట్టడానికి చీర తక్కువయ్యేసరికి నువ్వు పెట్టిన చీర ప్యాకెట్టయినా విప్పకుండా గబుక్కున సోగ్గత్తెకి బొట్టెట్టి చేతిలో పెట్టేసిందే. 'మీ అమ్మకి తరవాత క్షమాపణ చెప్పుకుంటాలే మీ ఇంటికొచ్చి' అంది నాతో.''

''అబ్బా! ఈ లంఖిణి పిల్ల నోరిప్పితే చాలు అన్నీ ఇలాంటి చావు కబుర్లే! చూసావా వదినా నాకెంతెంత అవమానాలో! ఇల్లా ఈదుకొస్తున్నా ఈ సంసారం''

''మీ మరదల్ని నువ్వే ఓదార్చాలత్తయ్యోయ్. నేనిప్పుడు బస్సుకి విశాఖపట్నం వెడుతున్నా ఉద్యోగంలో చేరడానికి. నా మొదటి జీతంతో ఎవరికీ చీరలు పెట్టను. నాకు నేనే కొనుక్కుని పెట్టుకుని కట్టుకుని ఆనందిస్తా. నువ్వు మళ్ళీ అమెరికా వెళ్ళిపోయే ముందొస్తాలే అత్తా నీకు చీరపెట్టకుండా వీడ్కోలు చెప్పడానికి.''

''దయచెయ్యి తల్లీ! కొన్నాళ్ళైనా నేను మన శ్శాంతిగా ఉంటా''


''హు! ఇదీ మాతృప్రేమ! కలికాలం''

★ ★ ★

''ఇదేంట్రా ముంగీ, ఇల్లింత ప్రశాంతంగా ఉందీ? అమ్మా అత్తయ్యా ఏరీ?''

## ఆనందం

**సయీఫ్ అలీఖాన్ ఆనందానికి అంతే లేకుండాపోతోంది. హాలీవుడ్ చిత్రం 'ఫోన్ బూత్'ని హిందీలో రిమేక్ చేయనున్నారు. ఈ చిత్రంలో హీరో ఆఫర్ సయీఫ్‌కి వచ్చింది. ఈ ఇంగ్లీష్ చిత్రాన్ని హిందీలో నిర్మించే నిర్మాత, దర్శకుల ఫోన్ కాల్స్‌తో బిజీగా ఉన్నాడు సయీఫ్. ఈ ఇంగ్లీష్ చిత్రం హీరో కాలిన్ ఫారెల్ కూడా ఈ చిత్రం హిందీలో రిమేక్ కావడం తనకెంతో ఆనందంగా ఉందని చెబుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన వివిధ విషయాల్ని, సలహాల్ని సయీఫ్‌కి ఇవ్వడానికి అతను సిద్ధంగా ఉన్నట్టున్నాడు.**



''అమ్మెవరిదో బారసాల ఫంక్షన్‌ట వెళ్ళింది. అత్తయ్యేమో పక్కింటావిడతో కలిసి సంక్రాంతి సేల్‌లో చీరలు కొనడానికి వెళ్ళింది.''

''పెట్టుడు చీరలు కాబోలు. బెల్లు మోగుతోంది. అమ్మొచ్చినట్టుంది.''

''ఏం చీర పెట్టించుకొచ్చిందో ఏమో. నాకు దడొస్తోంది. నువ్వే తియ్యి తలుపు.''

''అరె. అమ్మా అత్తయ్యా ఇద్దరూ వచ్చేసారూ!'' ''ఆవిడట్నుంచీ నేనిట్నుంచీ వొచ్చి వీధి చివర్న కలిసాం''

''ఎలా ఉందే లంఖిణి పిల్లా ఉద్యోగం?''


''ఇంకా సల్వార్ సూట్‌లోనే ఉంది. చీరల్దాకా రాలా'' ''ఏం వదినా ఏవో చాలా కొన్నట్టున్నావే?''

''నా సంగతికేంగానీ మీ చుట్టాలు బారసాలకి నీకేదో చీర పెట్టినట్టున్నారే''

''ఏదోలే. ఇదుగో చూడు''

''ఇదేంటి మరదలూ! ఇదీ..ఆనాడు మీ ఆడపడుచుకి గృహప్రవేశం నాడు పెట్టడం కోసమని నువ్వూ నేనూ రెండొందల్లో బాగా నాసిరకం చీర కోసం ఎక్కేషాపూ దిగేషాపూ తిరిగి కొనుకొచ్చిన చీరలా ఉందే!''

''అవునొదినోయ్. ఇది అదే. ఆ చీర నీళ్ళకెలా వచ్చిందీ?''




''అహ్హహ్హా! హొహ్హొహ్హొహ్హా! హ్హహ్హహ్హా..!''

''ఏవిటే రాక్షసీ ఆ నవ్వూ? పొగరెక్కిందా? ఆడపిల్లవు కావూ?''

''నువ్వు కొన్న చీర నీకే మళ్ళీ ఎలా వచ్చిందో నేన్చెప్పగలను''

''ఊర్కే వాక్కు. ఏదీ చెప్పు చూద్దాం.''

''నీ చీర నీకే తిరిగొచ్చిన కథాక్రమం బెట్టిదనిన..''

''తిన్నగా చెప్పి చావు''

''ఆహో! మాతృదీవన! నాకు నూరేళ్ళాయుష్షు. ఆనాడు నువ్వా చీర అత్తయ్యకి పెడితే, అత్తయ్య దాన్ని సోంబేరి పెళ్ళాం సోగత్తెకి పెట్టింది. సోగత్తె వాళ్ళుండేది వైజాగులోనే. నేనుండేది సోగత్తె పక్క పోర్షన్లోనే. సోగత్తె తన పెళ్ళిరోజు ఫంక్షన్ చేసుకుని నా కళ్ళెదురుగా ఆ చీరని తన మరదలు టక్కులాడికి పెట్టింది. టక్కులాడి తన కూతురి పుట్టినరోజు ఫంక్షన్ చేసి నన్నూ పిలిచింది. అప్పుడు ఈ చీరని టక్కులాడి తన మేనత్త పెద్దాపేరక్కకి పెట్టడం నా కళ్ళారా చూసా. తరవాత పెద్దాపేరక్కగారి కూతురి 'పెద్దమనిషి' ఫంక్షన్‌కి పిలిస్తే వెళ్ళా. అక్కడ ఇదే చీరని పెద్దాపేరక్క తన చుట్టం ముది ముత్తైదువగారికి బొట్టెట్టి ట్రాన్స్‌ఫర్ చెయ్యడం తిలకించి తరించా. మరి ముది ముత్తైదువ గారుండేది ఈ ఊళ్ళోనే.''

''ఇవాళనే వెళ్ళొచ్చింది ముది ముత్తైదువగారి మనవడి భారసాలకే!''

''మరంచేత నీ చీర నీకు భద్రంగా తిరిగొచ్చింది. నీకు బాగా నచ్చి కొన్న చీరేగా? కట్టుకో సంతోషంగా.''

''నోర్మూయ్. వెధవ వెటకారాలూ నువ్వూనూ. అసలు నువ్వు పుట్టినప్పటినుంచీ నాకన్నీ కష్టాలే. చూసావా వదినా ఈ పిల్లపిశాచానికి నేనంటే ఎంత లోకువో?''

''మధ్యలో నాకు ముప్పొచ్చింది. నేను లోపలికి పోతున్నా.''

★ ★ ★

''విన్నావుగా ముంగీ?''

''విన్నానే బాబూ. అంతా విన్నా. బుర్ర తిరిగిపోతోంది''

''అవునొరేయ్, నేన్నీకిచ్చిన ఎస్సైన్‌మెంటేం చేసావు? ఎంతవరకొచ్చింది? నీ రీసెర్చ్?''

''పూర్తయింది''

''అయిందా?! దొరికిందా! భారతీయులు దట్ టూ తెలుగువాళ్ళు పాదం మోపని దేశం?''

''దేశం దొరకలేదుగానీ ఓ ప్రదేశం దొరికింది''

''ఏంట్రా అదీ?''

''అంగారక గ్రహం''

''ఆ?!''

''ఊ..అక్కడికి చవగ్గా స్పేస్ షెటిల్లు వేసేవరకూ మనం వేచి ఉండాల్సిందే.''

''అంతదాకా మనం ఇలా చీరల వార్‌లలో బ్యారమంటూ ఉండాల్సిందేనా? హతవిధీ!''

★

## నిజమేనా?

ఏ పాత్రలు చేసినా సంచలనానికి కేంద్రబిందువయ్యే ఊర్మిళా మతోంద్కర్ ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమైంది. ఐ డ్రీమ్ పేరుతో నిర్మితమవుతున్న ఈ చిత్రంలో ఊర్మిళ అంధ విద్యార్థినిగా నటిస్తోంది. ఈ చిత్రానికి శ్రీపాల్ మోరాఖియా దర్శకత్వం వహిస్తున్నారు. 'ఈ చిత్రంలో ఊర్మిళ పాత్ర గురించి ఏమీ చెప్పలేం. ఈ చిత్రానికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి' అంటున్నాడు ఈ చిత్ర సీఇవో ఆశిష్ భాటియా. ఈ చిత్రంలో పాత్ర ఆమె విలక్షణతకి అద్దం పడుతుందేమో చూడాలి.

